క్లుప్తంగా

ముమ్మరంగా ఉపాధి పనులు



పనులు చేస్తున్న కూలీలు

శిరివెళ్ల: మండలంలో ఉపాధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వ్యవసాయ పనులు ముగియడంతో ఉపాధి పనులకు కూలీలు క్యూ కట్టారు. మండలంలో 2023–24 సంవత్సరంలో రోజుకు 5,800 వేల మంది పనులకు రావాల్సి ఉండంగా 5,545 మంది పనులకు హాజరవుతున్నారు. 16 గ్రామ పంచాయతీల్లో పంట కాల్వల పూడిక తీత పనులు జరుగుతున్నాయి. కొలతల ఆధారంగా కూలీలలకు రోజుకు రూ. 250 నుంచి 270 కూలి లభిస్తుంది. పంచాయతీల వారిగా కూలీల హాజరు.. శిరివెళ్లలో 552 మంది, బోయలకుంట్ల 320, చెన్నూరు 230, గంగవరం 320, గోవిందపల్లె 560, గుంప్రమాన్‌దిన్నె 540, గుండంపాడు 285, జీనేపల్లె 350, కామినేనిపల్లె 482, కోటపాడు 460, మహదేవపురం 495, మోత్కలపల్లె 50, వనికినిదిన్నె 311, వీరారెడ్డిపల్లె 80, వెంకటాపురం 280, యర్రగుంట్లలో 230 మంది కూలీలు పనులకు హాజరవుతున్నారని ఆ శాఖ అధికారులు పేర్కొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలి

ఉయ్యాలవాడ : జగనన్న లేఅవుట్ కాలనీల్లో మొదటి విడత గృహాలు మంజూరై, నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులు వెంటనే పనులు చేపట్టాలని తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు బుధవారం అవగాహన కల్పించారు.అల్లూరు గ్రామ సచివాలయంలో లబ్ధిదారులతో వారు మాట్లాడారు. ఈ నెల 6న హౌసింగ్ డే పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్మాణాలు చేపట్టని 12 మందికి ఇప్పటికే నోటీసులు జారీ చేశామన్నారు. ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పిస్తోందని,అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ రహీమ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ షాదిక్‌బాషా పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి



అడిషనల్ ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేపై హత్యకు కుట్రపన్నిన కర్నాటక రాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యే మణికంఠ రాథోడ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతలయ్య కోరారు. మల్లికార్జున ఖర్గే, ఆయన సతీమణిని హతమార్చే కుట్రకు సంబంధించిన మణికంఠ రాథోడ్ ఆడియో రికార్డింగ్ వెలుగులోకి వచ్చిందని, దోషులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలంటూ బుధవారం జిల్లా అడిషనల్ ఎస్పీ రమణకు వినతిపత్రం అందజేశారు. బీసీ సెల్ జిల్లా చైర్మెన్ రామకృష్ణ, షేక్ సలాం, కృష్ణా పాల్గొన్నారు.

నిండుకుండలా నీటి కుంట



గుండుపాపలలో నీటితో కళకళలాడుతున్న కుంట

దొర్నిపాడు: మండలంలోని గుండుపాపల గ్రామంలోని నీటి కుంట నిండుకుండను తలపిస్తోంది. ఇన్నాళ్లుగా నీళ్లు లేక ఒట్టిపోయిన కుంటలో పూడిక తీత పనులు చేయించారు. ఇటీవల ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సహకారంతో కేసీ కెనాల్ నీటితో కుంటను నింపినట్లు ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. దీంతో గ్రామస్తులకు వేసవిలో నీటి ఎద్దడి ఉండదన్నారు. ఇంటి అవసరాలకు, పశువులకు ఈ నీరు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

గోస్పాడు వాసికి డాక్టరేట్ ప్రదానం



వెంకటసుబ్బయ్య

గోస్పాడు: మండల కేంద్రమైన గోస్పాడుకు చెందిన కేడం వెంకటసుబ్బయ్యకు శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం తిరుపతిలో బోటనీ విభాగంలో డాక్టరేట్ లభించింది. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రొఫెసర్ సావిత్రమ్మ పర్యవేక్షణలో ట్యాపింగ్ ది ప్లాంట్ సోర్సెస్ ఫర్ ది ప్రొటెక్షన్ ఆఫ్ ఫైటో–నానో పార్టికల్స్ క్యారెక్టరైజేషన్ అండ్ ఏ వ్యాల్యుయేషన్ ఫర్ దెయిర్ పొటెన్షియల్ అప్లికేషన్ అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని యూనివర్శిటీకి సమర్పించినట్లు తెలిపారు. ఇందుకు గాను వృక్ష శాస్త్రంలో డాక్టరేట్ ప్రదానం చేశారని చెప్పారు. ఈయన పరిశోధన వ్యాసాలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

ట్రాక్టర్ ట్రాలీ లభ్యం


ఉయ్యాలవాడ : మండలంలోని సర్వాయిపల్లె గ్రామానికి చెందిన ఎద్దుల వెంకటేశ్వర్లు అనే రైతుకు చెందిన ట్రాక్టర్ ట్రాలీ ఆచూకీ లభ్యమైందని ఎస్‌ఐ సత్యనారాయణ బుధవారం తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 8న ట్రాలీ చోరీకి గురైందని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ట్రాలీ కోసం గాలించగా మండలంలోని కొండుపల్లె గ్రామానికి చెందిన సిద్దంరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి వద్ద ట్రాలీ లభ్యమైంది. నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మల్లెల గుభాళింపు

- నంద్యాల మార్కెట్‌కు తరలివస్తున్న దిగుబడి
- కేజీ రూ.వంద నుంచి రూ.150
- శుభకార్యాలుండటంతో పెరిగిన కొనుగోలు



మల్లెపూలను కొనుగోలు చేస్తున్న వినియోగదారులు



నంద్యాల(అర్బన్): పుష్పాల్లో మల్లెలది ప్రత్యేక స్థానం. ముఖ్యంగా మార్చి చివరి వారం నుంచి జూన్ నెల వరకు వీటి దిగుబడి అధికంగా ఉంటుంది. పట్టణ మార్కెట్‌లో మల్లెల సుగంధం ముంచెత్తుతోంది.పూల మార్కెట్‌లో ఎక్కడ చూసినా మల్లెల రాసులు కనిపిస్తున్నాయి. మగువల మనసు దోచే ఈ పువ్వులకు డిమాండ్ అధికంగా ఉంటుంది. ఈ పూలను ఇష్టపడని మహిళ ఉండదు. ఇక ప్రతి కార్యక్రమంలో ఈ పుష్పానికి చోటుంది. ప్రస్తుతం శుభకార్యాలు జోరుగా సాగుతుండటంతో కొనుగోళ్లు ఎక్కువగా ఉన్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు.

శుభకార్యాయల్లో మల్లెలదే అగ్రస్థానం..

పెళ్లిళ్లు, ఫంక్షన్లలో మల్లెలదే అగ్రస్థానం. ఆ పుష్పాలను ఉంచిన ప్రాంతాన్ని వాటి సుగంధం కమ్మేస్తుంది. ముఖ్యంగా పెళ్లిళ్లలో వధువు వాలు జడకు అల్లడంతో వీటితో ప్రథమ స్థానం. మిగిలిన పువ్వులు ఎన్ని ఉన్నా మల్లె జడకు డిమాండ్ ఎక్కువ.

సౌందర్య పోషణలోనూ పైచేయి..

సౌందర్య పోషణలో మల్లెలదే పై చేయి. సబ్బులు, తల నూనె, అగరొత్తులు, సెంట్ల తయారీలలో వీటిని అధికంగా ఉపయోగిస్తారు. ఇక జట్టు రాలడం, చుండ్రు నివారణలో వీటి పొడిని పలు దినుసుల్లో కలిపి వినియోగిస్తున్నారు.

భలే చౌక బేరం..

వైఎస్సార్ జిల్లా దువ్వూరు మండలం కానగూడూరు, చాగలమర్రి నుంచి నంద్యాల పట్టణానికి ప్రతి రోజూ మల్లెపూలు సరఫరా అవుతున్నాయి. వేసవి కాలంలో వీటి దిగుమతి అధికంగా ఉంటుంది. మార్చి, ఏప్రిల్, మే, జూన్ నెలల్లో మల్లె పూల దిగుబడి అధికంగా ఉండటంతో, ధరలు తక్కువగా ఉంటాయి. మిగతా మాసాల్లో వీటి దిగుబడి తక్కువ. ప్రస్తుతం కేజీ రూ.100 నుంచి రూ.150 వరకు విక్రయిస్తున్నాయి. పెళ్లిళ్ల సీజన్ ఉన్నా దిగుమతి ఎక్కువగా ఉండటంతో ధర తక్కువగా ఉంది. మిగిలిన కాలాల్లో కేజీ రూ.250 పైనే ఉంటుంది. దీంతో చవగ్గా లభ్యమవుతున్నాయి. వివేకానంద సెంటర్, గాంధీచౌక్, శ్రీనివాససెంటర్ ప్రాంతాల్లో వ్యాపారులు విక్రయిస్తున్నారు.

అమ్మకాలు బాగున్నాయి



ఇది మల్లె పూల సీజన్. ఈ నెలలో మల్లెలు అధికంగా పూస్తాయి. దీంతో మార్కెట్‌కు దిగుబడి ఎక్కువగా వస్తోంది. పెళ్లిళ్లకు, ఫంక్షన్లకు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. ధర కూడా తక్కువగా ఉండటంతో వినియోగదారులు విరివిగా కొనుగోలు చేస్తున్నారు. వధువుకు పూల జడకు వీటినే వినియోగిస్తాం. అక్కడక్కడా అందం కోసం గులాబీ, కనకాంబ్రాలు వాడతాం. ఈ పూలతో చేసిన జడకే అధిక డిమాండ్ ఉంటుంది. సైజును బట్టి ధర నిర్ణయిస్తాం.

– శ్రీనివాసులు, వ్యాపారి, నంద్యాల

రేపటి నుంచి గంగ జాతర

ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్.పాంపల్లె గ్రామంలో గ్రామ దేవత గంగమ్మ జాతర శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు వైభవంగా జరగనుంది. గ్రామస్తుల ఐకమత్యంతో రూ.50 లక్షల విరాళాలు సేకరించి గంగమ్మ ఆలయాన్ని నూతనంగా నిర్మించుకున్నారు. నెల రోజుల క్రితం ఆలయంలో విగ్రహాలను ప్రతిష్ఠించారు. 41 రోజుల వేడుకల్లో భాగంగా ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో జాతర నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు వివిధ పూజలు నిర్వహించి 14న అమ్మవారికి బోనాలు, పొంగపాలు నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు.

కేసు నమోదు

ఉయ్యాలవాడ : మహిళ పట్ల అసభ్యకరంగా వ్యవహరిస్తూ దుర్భాషలాడినందుకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సత్యనారాయణ బుధవారం తెలిపారు. మండల కేంద్రమైన ఉయ్యాలవాడలో కొట్టాల వెంకటలక్ష్మమ్మ ఇంటి వద్దనున్న చెట్టును తొలిగించే విషయంలో మహిళ అడ్డుకోవడంతో ఎగ్గోని చంద్రశేఖర్‌రెడ్డి ఆమెపై గొడ్డలితో చంపుతానని బెదిరించి, దుర్భాషలాడాడని బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మండల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించి మండల సమగ్రాభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సూచించారు. చాగలమర్రి మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ వీరభద్రుడు అధ్యక్షతన బుధవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలన్నారు. సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలలో ప్రజా ప్రతినిధులు, అధికారులు వారధిగా వ్యవహరిస్తూ ప్రజలకు చేరువ చేస్తూ ప్రభుత్వ లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ లక్ష్మీదేవి, వైస్ ఎంపీపీలు ముల్లా రఫీ, ఆశీర్వాదమ్మ, ఎంపీడీఓ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో మెరుగైన సేవలు

రైతులకు మెరుగైన సేవలందిస్తున్న రైతు భరోసా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి కోరారు. చాగలమర్రి మండలం పెద్ద బోధనం గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆర్బీకేలను మిని బ్యాంకులుగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారన్నారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మాణం చేపట్టనున్న ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎంపీపీ వీరభద్రుడు, జెడ్పీటీసీ లక్ష్మీదేవి, సర్పంచులు శివమ్మ, నరసమ్మ, ప్రతాప్‌రెడ్డి, షరీఫ్, గోవిందయ్య, ఎంపీటీసీలు నరసింహులు, పత్తి నారాయణ, లక్ష్మీరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు దస్తగిరి, రమణారెడ్డి, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

జీలుగ విత్తనాలు మంజూరు

ఆళ్లగడ్డ: పచ్చిరొట్ట ఎరువులుగా ఉపయోగపడే జీలుగా విత్తనాలు 50 శాతం సబ్సిడీతో పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి కిశోర్‌కుమార్‌రెడ్డి బుధవారం తెలిపారు. మండలానికి 320 క్వింటాళ్ల వచ్చాయన్నారు. క్వింటా పూర్తి ధర రూ.7,900 కాగా రైతులు రూ.3,950 చెల్లించాల్సి ఉంటుందన్నారు.రైతులు సమీప ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

రుద్రవరం: మండలానికి 660 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు మంజూరయ్యాయని వ్యవసాయాధికారి జ్యోతి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ పొలాల్లో భూసారం పెంపొందించేందుకు ప్రభుత్వం రైతులకు రాయితీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తుందన్నారు. 10 కేజీల జీలుగ విత్తనాల ప్యాకెట్ ధర రూ.790 కాగా 50శాతం రాయితీతో రూ.395లకే అందిస్తోందని చెప్పారు. అవసరమైన రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ జిరాక్స్ లతో ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

దొర్నిపాడు: మండలంలోని అన్ని వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల్లో 50 శాతం రాయితీతో జీలుగ విత్తనాలు అందజేస్తామని మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. క్వింటా మార్కెట్‌లో రూ.7,900 ఉన్నాయని వాటిని రాయితీతో రూ.3,950 ప్రకారం అందజేస్తామన్నారు. గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో పొలం పాస్‌బుక్, ఆధార్ కార్డు సమర్పించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఎకరానికి 10 కిలోలు చొప్పున 5 ఎకరాలకు యాభై కిలోల వరకు ఇస్తామని పేర్కొన్నారు.

గోస్పాడు: రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు జీలుగ విత్తనాలను సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి అబ్దుల్ హక్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలానికి 120 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు మంజూరయ్యాయని చెప్పారు.

బ్యాంక్‌లు సేవాదృక్పథంతో పనిచేయాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జేసీ నిశాంతి

నంద్యాల(సిటీ): వ్యాపార కోణంలో కాకుండా సేవా దృక్పథంతో ఖాతాదారుల అభివృద్ధికి బ్యాంకులు దోహదపడాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఎంఎస్‌ఆర్ కాంప్లెక్స్‌లో బుధవారం సాయంత్రం బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర నంద్యాల బ్రాంచ్‌ను జోనల్ మేనేజర్ ప్రసాద్, బ్రాంచ్ మేనేజర్ హరికృష్ణతో కలిసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ బ్యాంక్ 36వ బ్రాంచ్‌ని నంద్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని, బ్యాంకు సేవలు విస్తరించడంతో పాటు అభివృద్ధి పథంలో నడవాలని ఆకాంక్షించారు. జోనల్‌మేనేజర్ ప్రసాద్ మాట్లాడుతూ విజయవాడ కేంద్రంగా ఏపీలో 36 శాఖలు ఏర్పాటయ్యాయని చెప్పారు.

మృతి చెందిన గొర్రెపిల్లల పరిశీలన



మృతి చెందిన గొర్రెపిల్లలను పరిశీలిస్తున్న ఏడీఏ

దొర్నిపాడు: మండల కేంద్రానికి చెందిన బత్తుల నడిపి వెంకటసుబ్బయ్య, బత్తుల రాజు, మల్లికార్జునకు చెందిన 75 గొర్రెపిల్లలు కుక్కల దాడిలో మృతి చెందిన ఘటనకు సంబంధించి బుధవారం పశుసంవర్ధక శాఖ ఏడీఏ కొండారెడ్డి, డాక్టర్ హరిత కోబరాలను పరిశీలించారు. ఘటనపై గొర్రెల పెంపకందారులతో ఆరాతీశారు. రూ.5లక్షల వరకు నష్టం వాటిల్లిందని సాయం అందించాలని వారు కోరారు.

ఉర్దూ విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యత

నంద్యాల(సిటీ): ఉర్దూ విద్యకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఇందుకోసం నియోజకవర్గంలోని నందమూరి నగర్ ప్రాంతంలో 4.30 ఎకరాల్లో ఉర్దూ కళాశాల భవనాల ఏర్పాటుతో పాటు హాస్టల్ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే శిల్పారవిచంద్ర కిశోర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ కళాశాల ఏర్పాటుకు దాదాపు రూ.2 కోట్ల మంజూరయ్యాయని త్వరలో వాటికి సంబంధించిన పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఉర్దూ విద్యను అభ్యసించేందుకు పట్టణంలో వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడేవారని దీన్ని దృష్టిలో ఉంచుకుని కళాశాల ఏర్పాటుకు కృషి చేశామన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మృతి చెందిన బికారీ

దొర్నిపాడు: ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. దొర్నిపాడుకు చెందిన బికారీ (35) సప్లయర్స్ సామన్లను ఆటోలో నుంచి దించే క్రమంలో చేతిలోని ఇనుప పైపు విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో వెంటనే విద్యుత్‌షాక్ కొట్టడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ కొలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య షేక్ హీనాతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగాతమకు ఫిర్యాదు అందలేదని చెప్పారు.

రెండు ఇళ్లల్లో చోరీ

ఆళ్లగడ్డ: చాగలమర్రి మండలం మద్దూరు గ్రామంలో రెండు ఇళ్లల్లో చోరీ జరినట్లు ఎస్‌ఐ రమణయ్య బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన బాలయ్య మంగళవారం రాత్రి ఇంటికి తాళాలు వేసి ఇంటిపై పడుకున్నారు. తెల్లారి చూసేసరికి తాళం పగలగొట్టి ఉండటాన్ని గమనించి లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని ఏడు తులాల బంగారు, రూ.లక్ష నగదు తస్కరించారని వాపోయారు. అలాగే, అదే గ్రామానికి చెందిన థామస్ కుటుంబ సభ్యులు రెండు రోజులుగా ఇంటికి తాళం వేసి చాగలమర్రిలో ఉంటుండగా తాళం పగలగొట్టి బీరువాలోని సుమారు ఏడు తులాల బంగారు ఆభరణాలను చోరీ చేశారని బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

రేపటి నుంచి యోగా శిక్షణ తరగతులు

నంద్యాల(అర్బన్): స్థానిక పద్మావతి నగర్‌లోని శ్రీకృష్ణ మందిరం ఆవరణలో ఈ నెల 12వ తేదీ నుంచి వేసవి యోగా, వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు యోగా గురువు వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. శ్రీ సత్యసాయి ధ్యాన మండలి, శ్రీకృష్ణ భగవాన్ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే తరగతులు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు ఉంటాయన్నారు. ఆసక్తి కలినగి వారు సెల్ 9441802773 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మాన్యం కౌలుకు వేలం

రుద్రవరం: మండలంలోని ఎల్లావత్తుల నరసింహ స్వామి, ఈశ్వర స్వామి ఆలయాలకు చెందిన 47ఎకరముల మాన్యం కౌలుకు ఈఓ నర్సయ్య బుధవారం వేలం నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ భూముల కౌలు వేలానికి రైతులు పోటీపడటంతో ఈ ఏడాది ఆలయానికి ఆదాయం పెరిగిందన్నారు. గతేడాది రూ.2,14 లక్షలు రాగా ఈ ఏడాది రూ.4.24 లక్షలు సమకూరిందని చెప్పారు. గతేడాది కంటే రూ.2.10లక్షలు అదనంగా ఆదాయం వచ్చిందని వివరించారు.

నేటి నుంచి మొక్కజొన్న కొనుగోళ్లు

రుద్రవరం: ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం నుంచి మొక్కజొన్నలు కొనుగోలు చేస్తారని మండల వ్యవసాయాధికారి జ్యోతి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం మార్కెట్ యార్డుల ద్వారా క్వింటా రూ.1962ల ప్రకారం మొక్కజొన్నలు కొనుగోలు చేసేందుకు మద్దతు ధర ప్రకటించిందన్నారు. మండలానికి చెందిన 148 మంది రైతులు తమ మొక్కజొన్నలు విక్రయించుకునేందుకు ఆయా గ్రామాల ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వారందరూ తమ ధాన్యాన్ని ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డుకు తరలించి విక్రయించుకోవాలని సూచించారు.

17న మండల సర్వసభ్య సమావేశం

శిరివెళ్ల: ఈ నెల 17వ తేదీన ఎంపీపీ నాయక్ వసీం అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం బుధవారం తెలిపారు. సమావేశంలో గ్రామీణాభివృద్ధి, తాగునీరు, విద్య, వైద్యం,ఉపాధి, ఆరోగ్యం, రవాణా, శిశు సంక్షేమం, వ్యవసాయం, విద్యుత్ అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు విధిగా హాజరు కావాలని కోరారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి

ఆళ్లగడ్డ: ఉపాధి హామీ పథకం పనులను సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ రామచంద్రారెడ్డి కోరారు. చాగలమర్రి మండలం పెద్ద బోదనం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. నిర్ణీత కాలంలో పని ప్రదేశానికి చేరుకొని ఇచ్చిన కొలతల మేరకు పనులు పూర్తి చేస్తే కనీస వేతనం రూ.272 లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీఓ నిర్మల ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శిరివెళ్ల: మండలంలోని యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. ఎమ్మెస్సీ, ఎంకాం కంప్యూటర్, ఎంటెక్ కంప్యూటర్ అర్హతలు గల వారు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఆసక్తి గల వారు ధ్రువ పత్రాలతో ఈ నెల 15వ తేదీన కళాశాల కార్యాలయంలో ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

మోటార్ సైకిల్ దగ్ధం



దగ్ధమవుతున్న మోటార్ సైకిల్

శిరివెళ్ల: నంద్యాల– ఆళ్లగడ్డ జాతీయ రహదారిపై యర్రగుంట్ల విమలా స్కూల్ సర్వీస్ రోడుపై బుధవారం మోటార్ సైకిల్ దగ్ధమైంది. మహానంది మండలం బుక్కాపురం గ్రామానికి చెందిన శంకర్ అరటి పండ్ల బస్తా పెట్టుకొని మోటార్ సైకిల్‌పై ఆళ్లగడ్డకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మోటార్ సైకిల్ నుంచి పెట్రోల్ లీకై ఎండ వేడిమికి మంటలు చెలరేగాయి. గమనించిన శంకర్ వెంటనే మోటార్ సైకిల్‌ను వదిలేసి పక్కకు దూకడంతో ప్రాణాపాయం తప్పింది.

వైభవంగా మహాశాంతి హోమం





పూజల్లో పాల్గొన్న ఎస్పీ రఘువీర్ రెడ్డి, మహాశాంతి హోమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ గంగుల

రుద్రవరం: మండలంలోని కొండమాయపల్లె పంచాయతీ మజరా వెలగల పల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీ గోదా సమేత వాసాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ఆలయ ఆవరణలో మహాశాంతి హోమాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. రెండో రోజు ఉదయం నుంచి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, స్వామి వారికి పంచామృతాభిషేకం, నీరాజనం, మహాశాంతి హోమం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ప్రథమ వార్సికోత్సవ వేడుకలు తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ..

వేడుకల్లో మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి పాల్గొన్నారు. ఆలయం వద్దకు చేరుకున్న వారికి నిర్వాహకులు స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహాశాంతి హోమంలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు ముగియగానే అర్చకులు వారిని కాలువ,పూలమాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

'జగనన్నకు చెబుదాం'తో సమస్యలకు సత్వర పరిష్కారం

- ప్రజల సంతృప్తి స్థాయి కోసం జిల్లా, మండల స్థాయి పీఎంయూ యూనిట్‌ల ఏర్పాటు
- 1902కి వచ్చే ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



నంద్యాల: ప్రజా విజ్ఞప్తులను సంతృప్తికర స్థాయిలో పరిష్కరించడమే 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ తెలిపారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్ లో జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమంపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను సంతృప్తికర స్థాయిలో పరిష్కరించడం కోసం ఈ నెల 9 నుంచి కొత్త కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించారన్నారు. స్పందన దరఖాస్తుల పరిష్కారంపై ప్రజల సంతృప్తి స్థాయి పర్యవేక్షణ కోసం జిల్లా, మండల స్థాయి పీఎంయూ యూనిట్లను ఏర్పాటు చేశామన్నారు. 1902కి వచ్చే ఫిర్యాదుల విషయంలో అత్యంత శ్రద్ధ చూపాలని అధికారులను ఆదేశించామన్నారు. అర్జీల ద్వారా పరిష్కారానికి సాధ్యం కాని సమస్యలను 1902 టోల్ ఫ్రీ నంబర్ కు కాల్ చేసి ఫిర్యాదు చేసి వేగవంతమైన, నాణ్యమైన పరిష్కారాన్ని పొందవచ్చన్నారు. స్పందన కార్యక్రమం ప్రత్యక్ష పర్యవేక్షణ కోసం జిల్లాకు ప్రత్యేకంగా సీనియర్ ఐఏఎస్ అధికారిని నియమించారని, వారు జిల్లాలో పర్యటించి, కార్యక్రమం అమలు తీరును పరిశీలిస్తారని చెప్పారు. 1902 కాల్స్ స్వీకరణ, ఐవీఆర్ఎస్ ఎస్ఎంఎస్ సందేశంతో మల్టీపుల్, ఫీడ్ బ్యాక్, అప్ డేట్ సమాచారం ఎప్పటికప్పుడు హెల్ప్ డెస్క్ కంట్రోల్ రూమ్ నుంచి అందుతుందన్నారు. ఫోన్ కాల్స్ ద్వారా అందిన ఫిర్యాదులను సీఎంఓ స్థాయి నుంచి నేరుగా సచివాలయాల పరిధిలోని ఆయా శాఖల విభాగాల వరకు సీనియర్ అధికారుల పర్యవేక్షణలో క్షేత్ర స్థాయిలో పరిష్కారం చూపుతారన్నారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను జిల్లా, మండల స్థాయి టీములు పరిశీలించి విశ్లేషణ చేయడంతో పాటు 15 రోజులకు ఒకసారి సంబంధిత నివేదికలను స్వీకరించి ఫిర్యాదుల పరిష్కారం ఎంత మేర జరుగుతుందనేది తెలుస్తుందన్నారు. డివిజన్ స్థాయిలో అందే ఫిర్యాదులను పరిష్కరించేందుకు జిల్లాలోని అన్ని రెవెన్యూ డివిజన్ పరిధిలో ఒక పీఎంయూ ఏర్పాటుచేసి నోడల్ అధికారిని నియమిస్తామని పేర్కొన్నారు. పర్యవేక్షణకు రెవెన్యూ, పంచాయతీ రాజ్, వైద్య ఆరోగ్యం, హోమ్ శాఖ, వ్యవసాయ శాఖల అధికారులు సభ్యులుగా వ్యవహరిస్తారన్నారు.

విద్యార్థినులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆళ్లగడ్డ: పది ఫలితాల్లో చాగలమర్రి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 550 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థిని హిబా ముబశిరతో పాటు హేమలత (537), ఆయేషా సిద్దిక్ (525)ను వైఎస్సార్‌సీపీ నాయకులు బాబులాల్, కుమార్‌రెడ్డి బుధవారం ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేసిందన్నారు. హెచ్ఎం విజయలక్ష్మీ, పీఎంసీ చైర్మన్ మహబూబ్, వైఎస్సార్‌సీపీ సేవాదల్ జిల్లా అధ్యక్షుడు గణేష్‌రెడ్డి ఉన్నారు.

మొక్కజొన్నకు రూ.1962 మద్దతు ధర

ఆళ్లగడ్డ: మొక్కజొన్న పంటను ప్రభుత్వం రూ.1962 మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని మండల వ్యవసాయాధికారి కిశోర్‌కుమార్‌రెడ్డి బుధవారం తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు విక్రయించేందుకు రైతులు సమీపంలోని ఆర్బీకే లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పేర్లు నమోదు చేసుకున్న రైతుల సెల్‌ఫోన్‌కు మేసేజ్ వస్తుందని చెప్పారు.

మహానందిలో రాహుకేతు విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



విగ్రహాలకు విశేష పూజలు చేస్తున్న పండితులు

మహానంది: దక్షిణ భారతదేశంలో ప్రముఖ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న మహానందిలో రాహుకేతు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, రాహుకేతు మండప నిర్మాణ దాతలు బాబ్జీ, జర్నలిస్ట్ హరికిషన్, వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి రాత్రి వరకు విశేష పూజలు నిర్వహించారు. గణపతి పూజ, కంకణధారణ, పంచగవ్య ప్రాశన, యజమానుల కంకణ ధారణ పూజలు నిర్వహించారు. అనంతరం నూతన రాహుకేతు విగ్రహాలకు కంకణధారణ చేసి ఆలయ ప్రదక్షిణతో రాహుకేతు మండపం వరకు చేరుకుని మూలమంత్ర అనుష్ఠానములు నిర్వహించారు. రాత్రి మృత్సంగ్రహణం, అంకురార్పణ, ప్రధాన కలశ స్థాపన, నవగ్రహ, క్షేత్రపాలక, యోగిని, వాస్తు, సర్వతోభద్ర మండపముల ఆవాహన పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. అనంతరం రాహుకేతు విగ్రహ మూర్తులకు జలాధివాసం పూజలు వైభవంగా జరిగాయి. విగ్రహ, కాలసర్పయంత్ర ప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పూజా కార్యక్రమాల్లో సూపరింటెండెంట్లు వెంకటేశ్వరుడు, శశిధర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.